క్లుప్తంగా

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు


పనులను పరిశీలిస్తున్న ఏఈ రామసుబ్రహ్మణ్యం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె, డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామాల్లో గురువారం వీచిన పెనుగాలులకు 54 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో రెండు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగంగా చేస్తున్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఏడీ ఖాజావలి, ఏఈ రామసుబ్రహ్మణ్యం పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గాలి వల్ల విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రెండురోజులుగా సిబ్బంది శ్రమిస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడకుండా రాత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య, లైన్‌మెన్ నాగన్న ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ : మండలానికి రెండో విడతలో 4,147 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 1 -10వ తరగతి వరకు 2,517 మంది విద్యార్థులకు 25,485 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు రెండు విడతల్లో 11,661 పాఠ్య పుస్తకాలు వచ్చాయని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని రకాల పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలలకు చేరవేస్తామని ఎంఈఓ స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): బలిజ, కాపు, సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యవస్థాపకులు దండె దస్తగిరి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన, ఇంటర్మీడియెట్‌లో 950 మార్కులు సాధించిన బలిజ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం ఈనెల 28న ఉదయం 10 గంటలకు స్థానిక వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వివరాలకు సెల్ 9440420326 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(అర్బన్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏఈసీఈఏజీ-3045 ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నంద్యాల డివిజన్ కాంట్రాక్ట్ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్థలో 26 ఏళ్లుగా వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు తక్కువ వేతనాలతో జీవితాలు కొనసాగిస్తున్నారని వారిని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా గోపాల్‌యాదవ్, కార్యదర్శిగా సురేంద్ర, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా జనార్దన్ ఎన్నికయ్యారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

ఉయ్యాలవాడ : మండలంలోని సర్విపల్లె గ్రామంలో మురుగు నీటి సమస్య పరిష్కారం చూపారు. గతేడాది డిసెంబర్‌లో గ్రామంలో ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో స్థానికులు సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో యాన రూ.8.50లక్షలు మంజూరు చేయించారు. నిధులు విడుదల కావడంతో సర్పంచ్ గురుప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రైనేజీ, సిసి రోడ్లు పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. నిర్మాణం పూర్తయితే సమస్యకు పరిష్కారం లభించినట్లు అవుతుంది.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఆళ్లగడ్డ: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక చైతన్య రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి శివప్రసాద్ బాధితులకు సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తులను చిన్నచూపు చూడకూడదని కోరారు. క్లబ్ సెక్రటరీ గంగన్న, ఏపీఎం వర్ధనాచారి ఉన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో అలంకారపూజ, అలంకార హారతులు శాస్త్రోక్తంగా చేప ట్టారు. అనంతరం గోమాతకు విశేష పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాంగంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, భక్తులు పాల్గొన్నారు.

సూర్యప్రతాపం

సూర్యుడి ప్రతాపానికి చాగలమర్రిలో వరుసగా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండుతున్న ఎండల ధాటికి ఉదయం 9గంటలు దాటితే జనం బయటకు రాలేని పరిస్థితి. ఓ పక్క వడగాడ్పులు, మరో పక్క ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. ఈ ప్రాంతంలో మల్లె తోటలు అధికం. ప్రస్తుతం పూల దిగుబడి అధికంగా ఉంటుంది. ఎండ దెబ్బకు పూల కోతలకు రావడానికి కూలీలు జంకుతున్నారు. ఒక వేళ వచ్చినా వారు ఉదయం 11 గంటలకంతా ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇక పని మధ్యలో రెండు సార్లు కూల్ డ్రింక్స్, మజ్జిగ, చల్లని నీరు అందజేయాల్సి వస్తుందని, లేకపోతే పనులకు రాలేమని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు.


నిర్మానుష్యంగా మారిన గాంధీ సెంటర్

- చాగలమర్రిలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా 43.5 డిగ్రీలు నమోదు
- ఉదయం 9గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
- ఎండవేడిమి తట్టుకోలేక పనులకు రామంటున్న కూలీలు
- వచ్చినా.. మధ్యలో కూల్ డ్రింక్స్, మజ్జిగ ఇస్తున్న రైతులు
- ఉదయం 11గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్న శ్రామికులు


అరుగుపై సేదదీరుతున్న వృద్ధులు

చాగలమర్రి: 39, 41, 43, 42, 43.5.. ఇవేమీ పరీక్షలోవచ్చిన ర్యాంకుల కాదు.. చాగలమర్రిలో వరుసగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు. సూర్య భగవానుడి భగ భగలకు జనం బెంబేలెత్తిపోతున్నారు. మండుతున్న ఎండల కారణంగా ఉదయం 11 గంటలైతే చాలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ నెల 14 వ తేదీన 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అప్పటి నుంచి వరుసగా ఉష్ణోగ్రతలు పెరగుతున్నాయి. 18వ తేదీన అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, 19, 20 తేదీల్లో 42, 21, 22, 23 తేదీల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం, శుక్రవారం 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ఉదయం 10.00 గంటలు దాటితే జనం బయటకు రాలేని పరిస్థితి. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, తాపీ పని చేసేవారు, ఉపాధి హామీ కూలీలు ఎండలకు భయపడి పనులకు వెళ్లడం లేదు. ఒక వేళ వెళ్లినా ఉదయం 11 గంటల లోపే ఇళ్లకు చేరుకుంటున్నారు. చాగలమర్రి ప్రాంతంలో ఎక్కువగా రైతులు మల్లె తోటల సాగు చేశారు. మల్లెపూల దిగుబడి వేసవిలోనే ప్రారంభమవుతుంది. ప్రస్తుతం తోటల్లో పూలు విరగ్గాశాయి. అయితే మల్లెపూల కోతలకు కూలీలు రావడంలేదు. ఎండ వేడిమికి పనులు రాకపోవడం, వచ్చిన వారు అధికంగా కూలి డిమాండ్ చేస్తున్నారు. అలాగే.. మధ్యలో కూలీలకు మజ్జిగ, కూల్ డ్రింక్ అందజేయాల్సి ఉంటుంది. ఇక గంటకోసారి చల్లని నీరు ఇవ్వాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎండలు మండుతుండటంతో ఉక్కపోత వేధిస్తుంది. దీంతో ఇంట్లో ఉండలేక చెట్ల కింద, ఆలయాల్లోని అరుగులపై ప్రజలు సేదదీరుతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



ఈ వేసవిలో నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు డీహైడ్రేషన్ గురయ్యే అవకాశం ఉంది. నీరు చెమట రూపంలో అధికంగా ఆవిరై కళ్ళు తిరగటం , నీరసం, వాంతులు, విరేచనాలై తద్వారా శరీరంలో వేడి ఎక్కువై వడదెబ్బకు గురై, పరిస్థితి విషమించి ప్రాణాపాయం కలిగే ప్రమాదముంది. వడదెబ్బ నుంచి కాపాడుకునేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. అత్యవసరమైతేనే ఎండలోకి వెళ్లరాదు. ఒక వేళ వెళ్లినా, ప్రతి అరగంటకొకసారి చల్లని మజ్జిగ, నీరు అధికంగా తీసుకోవాలి. ఉప్పు, కారం, మసాల పదార్థాలు తక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ ఇమ్రాన్ షేక్, ప్రభుత్వ వైద్యుడు

కూలీలు పనులకు రావడం లేదు



ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు పనులకు రావడంలేదు. ఒకవేళ వచ్చిన అధిక కూలి డిమాండ్ చేస్తున్నారు.ఉదయం 7గంటలకు వచ్చి 11 గంటలకంతా వెళ్లిపోతున్నారు. పని మధ్యలో రెండుసార్లు వారికి కూల్ డ్రింక్, మజ్జిగతో పాటు చల్లని నీళ్లు అందజేస్తున్నాం. వాటిని ఇవ్వకపోతే రామని తెగేసి చెబుతున్నారు.

– నాయబ్ రసూల్, తాపీ మేస్త్రి, చాగలమర్రి

క్లాప్ యూజర్ చార్జీలు వసూలు చేయాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని 42 వార్డుల్లో పేరుకుపోతున్న క్లాప్ యూజర్ చార్జీలను నిర్ణీత గడువులోపు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో క్లాప్ యూజర్ ఫీజును ఎప్పటికప్పుడు వసూలు చేయాలన్నారు. అలాగే పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వేసవి శిబిరం ముగింపు ఉత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): కళారాధన సాంస్కృతిక సంస్థ, లయన్స్‌క్లబ్, ఐఎంఏ సంయుక్త సహకారంతో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలను శనివారం సాయంత్రం నిర్వహిస్తామని డాక్టర్ మధుసూదన్‌రావు, రవికృష్ణ శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో శిక్షణ పొందిన బాలబాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని చెప్పారు. అలాగే రిటైర్డు గుర్రాల రామకృష్ణయ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తారని వివరించారు.

కేసు నమోదు

శిరివెళ్ల: మండలంలోని గంగవరం గ్రామంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అనుమతి లేకుండా, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా మట్టిని తరలిస్తున్న 3 ట్రిప్పర్లు, ఓ హిటాచీ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని చెప్పారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు


ఆళ్లగడ్డ విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి, ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు.ఇంటర్నల్ స్క్వాడ్ ఆన్ సీడ్స్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు విత్తన దుఖాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అమ్మిన విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. అధీకృత కంపెనీలకు చెందిన విత్తనాలను నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

చాగలమర్రి: రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ స్క్వాడ్ అధికారి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండల వ్యవసాయాధికారి రంగా నేతాజీతో కలిసి పట్టణంలోని విత్తనాల షాపులను తనిఖీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత


మాట్లాడుతున్న జేసీ నిశాంతి

నంద్యాల: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటును అందించాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పర్యావరణ పరిరక్షణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు గ్రామ, మండల స్థాయిలలో ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అలాగే పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, మున్సిపల్, పర్యావరణం తదితర శాఖలు పర్యావరణ పరిరక్షణ అంశంపై ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించి శనివారం సాయంత్రంలోపు డీఆర్ఓకు పంపాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

నంద్యాల(సిటీ): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక 37వ వార్డు నందమూరి నగర్‌లో పర్యావరణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలుష్య కారకాల నుంచి పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు మేలు చేసినవారవుతామని చెప్పారు. అనంతరం సచివాలయ సిబ్బంది, స్థానికులతో పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.

జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

నంద్యాల(సిటీ): పట్టణంలోని అంకాల్ పేట, బైర్మల్ వీధిలోని మున్సిపల్ షాప్‌నకు 2కేవీ విద్యుత్ కనెక్షన్ కోసం మున్సిపల్ కమిషనర్ బదులుగా జూనియర్ అసిస్టెంట్ సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌కు శుక్రవారం తాకీదులు జారీ చేశారు. రెవెన్యూ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగబ్రహ్మం అంకాల్‌పేట, బైర్మల్ వీధిలో మున్సిపల్ షాపులకు నూతన కరెంట్ మీటర్ల కనెక్షన్లకు సమర్పించిన డాక్యుమెంట్లలో ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారి సంతకం లేకుండా విద్యుత్ శాఖకు దరఖాస్తులు సమర్పించారన్నారు. ఈ విషయంపై ఎగ్జిక్యూటివ్ అథారిటీ దృష్టికి తీసుకురాకుండా అతనే సంతకం చేసి డాక్యుమెంట్లు సమర్పించిన విషయంలో క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో నోటీసులు అందిన 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. నిర్ణీత గడువులోపు సంజాయిషీ సమర్పించకపోతే సీసీఏ రూల్స్ మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


కమిషనర్ జారీ చేసిన మెమో

మధ్యాహ్న భోజనం బడిలోనే తినేలా చూడాలి


ఎంఈఓను ప్రశ్నిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు చాలా మంది పిల్లలు ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారని, ఎందుకు బడిలో చేయడం లేదని, నిర్వహణలో లోపం ఉండటంతోనే ఇలా జరుగుతుందని జెడ్పీటీసీ శకుంతల ఎంఈఓ అబ్దుల్ కరీంను ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ నాగఅనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, మధ్యాహ్న భోజనంపై సమీక్ష రాగా ఎంఈఓ మాట్లాడుతుండగా సభ్యులు ప్రశ్నించారు. పాఠశాలలోనే విద్యార్థులు భోజనం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. పది ఫలితాలు ఇంకా మెరుగు పడేలా చూడాలని సూచించారు. పశువైద్యులు వేళలకు వచ్చి వైద్యం అందించాలన్నారు. అధికారులు ఆయా శాఖల పనితీరును తనిఖీ చేయాలన్నారు. అలాగే విద్యార్థులు నీరు తాగేందుకు బయటకు వస్తున్నారని, వాహనాలతో ప్రమాదం ఉందని బయటకు వెళ్లకుండా చూసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. రైతులు ఐదుగురు గ్రూపుగా ఏర్పడి డ్రోన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని వీఏఏ మల్లికార్జున సూచించారు. రైతు వాట 10శాతం, ప్రభుత్వ సబ్సిడీ 40శాతం, బ్యాంకు రుణం 50శాతం ఇస్తుందన్నారు. నాణ్యత, కంపెనీని బట్టి రూ.6లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఉంటుందన్నారు. ఈనెల 30న తొలివిడతగా వైఎస్సార్ రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. వేసవిలో తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ సూచించారు. ఎండ తీవ్రత మరో పది రోజుల వరకు ఉండే అవకాశం ఉన్నందున ఉపాధి, రైతు పనులకు వెళ్లే కూలీలు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్లలోపే విద్యుత్‌ను వినియోగించుకోవాలని లేదంటే మొత్తం బిల్లు చెల్లించాల్సి వస్తుందిని విద్యుత్ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సహకార సంఘం చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ కొండారెడ్డి, పశువైద్యాధికారులు హరిత, పావని, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిద్ధంగా 'జగనన్న విద్యా కానుక'


శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలు,


పుస్తకాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజు జగనన్న విద్యా కానుకల పంపిణీకి రంగం అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలకు తెరిచేలోగా కానుకలు పాఠశాలలకు అందుబాటులో ఉంచేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. విడతల వారీగా వస్తున్న కానుకలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిల్వ చేస్తున్నారు. మండలంలో 1-10 వ తరగతి విద్యార్థులకు 63 వేల పాఠ్య పుస్తకాలకు గాను మొదటి విడతగా ఈ నెల 1న 18 వేల పుస్తకాలు, ఈ నెల 25న రెండవ విడతలో 10వేల పుస్తకాలు వచ్చాయి. అలాగే 4,082 బెల్టులు, 1,022 డిక్షనరీలు వచ్చాయి. పాఠ్య పుస్తకాలు నాణ్యతను అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 7 కానుకలు రాగానే వాటిని ఓ కిట్‌గా తయారు చేసి వాటిని పాఠశాలలను అందజేస్తారు. మండలంలో 1 -10వ తరగతి వరకు 5,641 మంది విద్యార్థులున్నారు.







15వ వార్డులో పట్టాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, 25వ వార్డులో..కౌన్సిలర్ కృష్ణమోహన్, 31వ వార్డులో.. కౌన్సిలర్ అనురాధ

వాడవాడలా ఇళ్ల పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న కౌన్సిలర్ చంద్రశేఖర్


23వ వార్డులో పార్థసారథి ఆధ్వర్యంలో..

నంద్యాల(అర్బన్)/(సిటీ): ఇళ్ల పట్టాల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇళ్ల పట్టాల పంపిణీని కౌన్సిలర్లు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంతో పట్టాల పంపిణీ పట్టణంలో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఖరీదైన స్థలాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు చెబుతున్నారు. స్థానిక నిశాంత్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 15వ వార్డు ఇన్‌చార్జ్ సన్నల సాయిరాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 76మందికి పట్టాలు అందజేశారు. 25వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో 60మందికి, 31వ వార్డు మూలసాగరంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ అనురాధ, 26వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కౌన్సిలర్ చంద్రశేఖర్ 76 మందికి, 23వ వార్డులో పార్థసారథి ఆధ్వర్యంలో 80 మందికి పట్టాలు పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాసులు, జమాల్, లక్ష్మిదేవి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కాల పరిమితిని సవరించాలి

నంద్యాల(వ్యవసాయం): ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీ కాల పరిమితిని సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ట్రైబల్ ఉపాధ్యాయులకు జీఓ నంబర్ 33 ప్రకారం బదిలీకి కనీస రెండు సంవత్సరాల కాల పరిమితిని విధించడం సబబు కాదన్నారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు 47 జీఓ ప్రకారం జీరో సర్వీసును అమలు చేస్తూ మరో వైపు ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు మాత్రం రెండేళ్ల కాల పరిమితి విధించడం సరికాదని చెప్పారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, ఎస్టీయూ నాయకులు నాగేంద్రకుమార్, శ్రీనివాస రెడ్డి, గురునాథ్, రంగస్వామి పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ, పేదరికం, నిరుద్యోగం, కార్పొరేట్ సంస్థలకు ఉచిత రాయితీలు వంటి వాటితో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని నంద్యాల జిల్లా ఆవాజ్ కార్యదర్శి మస్తాన్‌వలి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకే ఇటీవల జరిగిన కర్ణాటక, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వానికి ఓటర్లు వ్యతిరేకంగా ఓటు వేశారని గుర్తు చేశారు.

కుట్టు మిషన్ల పంపిణీ


ట్రైనింగ్ సర్టిఫికెట్లతో చెంచు మహిళలు

ఆళ్లగడ్డ: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం అభివృద్ధి చెందుతుందని అహోబిలం మఠం జీపీఏ సంపత్ అన్నారు. శ్రీనివాస సేవా సంస్థ టీవీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన 18 మంది చెంచు మహిళలకు శుక్రవారం అహోబిల దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధ్రువ పత్రాలతో పాటు కుట్టు మిషన్లు అందజేశారు. దేవస్థానం ఓఎస్డీ శివప్రసాద్, టీవీఎస్ ఏజీఎం బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

అధ్యాపకుడికి అవార్డులు


గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ మల్లేశ్వర్‌రెడ్డి

మహానంది: చదివిన కాలేజీలోనే అధ్యాపకుడిగా పనిచేయడం ఓ విశేషమైతే, ప్రతిష్టాత్మకమైన రెండు అవార్డులు పొందడం మరో విశేషం. మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో అగ్రానమీ (సేద్యవిభాగం)లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎ.మల్లేశ్వరరెడ్డికి రెండు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ నాయక్ శుక్రవారం తెలిపారు. మెట్ట వ్యవసాయంలో చేసిన పరిశోధనలకు ఉత్తమ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తగా ఒకటి, ఏజీ ఎంఎస్సీ అగ్రానమీలో వర్షపునీటిలో యాజమాన్యం, వేరుశనగ పంటలపై చేసిన పరిశోధనలకు యూనివర్శిటీ స్థాయిలో ఓజీపీ అత్యధికంగా రావడంతో ఎన్‌జీ రంగా యూనివర్శిటీ వారు గోల్డ్‌మెడల్‌తో సత్కరించిందని చెప్పారు. బాపట్లలో జరిగిన స్నాతకోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఐసీఏఆర్ మాజీ సెక్రటరీ డాక్టర్ ఆర్ఎస్ పరోడా, యూనివర్శిటీ వీసీ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి అవార్డులు అందజేశారని వివరించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపకులు అభినందించారు.

30న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

జూపాడుబంగ్లా: తరిగోపుల గ్రామంలోని సీఎస్‌ఐ చర్చి తొమ్మిదొవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చర్చి సంఘం పెద్దలు తెలిపారు. శుక్రవారం వారు జూపాడుబంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 29వ తేదీ సాయంత్రం లోపు రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 7702232280, 9573258151 నంబర్లలో సంప్రదించాలని కోరారు.